భావి చిత్రకారులకు మార్గదర్శి అంబాజీ

● ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి



అంబాజీకి విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఇనాక్, తదితరులు

హైదరాబాద్ సిటీ/కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జీవం ఉట్టిపడేలా చిత్రాలను గీసే అంతర్జాతీయ చిత్రకారుడు అంబాజీ భవిష్యత్ తరాలకు మార్గదర్శి అని ప్రముఖ కవి, రచయిత ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. చిన్నతనంలోనే పాఠశాలలో రాముడు అని రాయమంటే శ్రీరాముడి చిత్రపటాన్ని పలకపై చిత్రించారని ప్రశంసించారు. తెలుగు విశ్వవిద్యాలయం 38వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బాచుపల్లి ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అంబాజీకి అంతర్జాతీయ విశిష్ట పురస్కారం, రూ.లక్ష చెక్కును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇనాక్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, కళలకు ఈ విశ్వవిద్యాలయం చిహ్నంగా నిలిచిందన్నారు. అంబాజీ చిత్రకళలో ద్రోణుడు లేని ఏకలవ్యుడిగా నిలిచారని తెలుగు యూనివర్సిటీ వీసీ కిషన్‌రావు అన్నారు. రిజిస్ట్రార్ రమేశ్ భట్టు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ చిత్రలేఖనం విద్యార్థులు అంబాజీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.



పురస్కారగ్రహీతలతో అతిథులు

ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర కీలకం

రవీంద్రభారతి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్ల పాత్ర కీలకమని గ్రేటర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉత్తమ డ్రైవర్లకు సత్కారం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టీఎస్‌ఆర్టీసీ దేశంలోనే నంబర్‌వన్‌గా కొనసాగుతోందన్నారు. ప్రమాదాల విషయంలో కూడా అతి తక్కువ రేటును నమోదు చేసుకుందని తెలిపారు. డ్రైవర్‌గా పనిచేస్తూ తోటి డ్రైవర్ల సేవలను గుర్తించి పురస్కారాలు ప్రదానం చేయడం రాములు గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్, టీఎస్ రావు, కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రామ్మోహన్, దాసరి దయానంద్ రెడ్డి, తేజ, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో డాక్టర్ హిమాన్షుపాఠక్, తదితరులు

దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలు

● ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షుపాఠక్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మరో 114 కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ ప్రకటించారు. తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాలు 2024-25లో అమలు చేయాల్సిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక గురించి చర్చించేందుకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును శుక్రవారం ఆయన రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో ప్రారంభించారు. ఈ సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఐసీఏఆర్ అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(అటారీ) 10వ జోన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. తద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వెంకటరమణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, నార్మ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ వి.సుధారాణి, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయ, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ మహేందర్, విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, కేవీకేల కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు. కాగా, ఐసీఏఆర్‌లో ఉద్యోగంలో చేరిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్లు ఐసీఏఆర్ బలోపేతానికి కృషి చేయాలని డాక్టర్ హిమాన్షు పాఠక్ సూచించారు.

క్వాలిటీ ఎడ్యుకేషన్‌కు 'శివ్‌నాడార్' ది బెస్ట్

● 95 శాతం విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్



మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్‌కుమార్‌సింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, ఉద్యోగావకాశాలు పొందాలనుకునే విద్యార్థులు, తల్లిదండ్రుల ఆకాంక్షలను ఢిల్లీలోని శివ్‌నాడార్ విశ్వవిద్యాలయం(ఎస్ఎన్‌యూ) తప్పకుండా నెరవేరుస్తుందని అడ్మిషన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ రాజీవ్‌కుమార్‌సింగ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శివనాడార్ యూనివర్సిటీ ప్రత్యేకతలు, అడ్మిషన్ల విధానం, గతేడాది సాధించిన ఫలితాల గురించి వివరించారు. యూనివర్సిటీలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, నాచురల్ సైన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగాలు(స్కూల్స్) ఉన్నాయని, విలువలు, నైతికత, నాయకత్వ లక్షణాలతోపాటు బహుళ విభాగాల(మల్టీ డిసిప్లినరీ) విధానంతో అంతర్జాతీయస్థాయి విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్, ప్లేస్‌మెంట్స్ మధ్య రిలేషన్‌ను విద్యార్థులు అర్థం చేసుకునేలా శిక్షణ ఇచ్చేందుకు కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి యేటా 95 శాతం మంది విద్యార్థులకు(గరిష్టంగా రూ.58 లక్షలు, సగటున రూ.11 లక్షల ప్యాకేజీలతో) ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయని చెప్పారు. అడ్మిషన్ల విధానం, ఫీజులు, ఇతర వివరాలకు శివ్‌నాడార్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

టెన్నిస్ రన్నరప్ వేమూరి అభయ



ఆకాంక్షకు ట్రోఫీ బహూకరిస్తున్న రామారావు, చాముండేశ్వర్‌నాథ్, తదితరులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఎఫ్ఎన్‌సీసీ జాతీయ మహిళల టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి వేమూరి అభయ రన్నరప్‌గా నిలవగా, ఆకాంక్ష(మహారాష్ట్ర) టైటిల్ కైవసం చేసుకుంది. శుక్రవారం ఫిలింనగర్‌లోని ఎఫ్ఎన్‌సీసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన ఫైనల్లో ఆకాంక్ష 6-4, 6-3తో అభయపై నెగ్గి, విజేతగా నిలిచింది. సినీనిర్మాత కేఎస్ రామారావు, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్ కలిసి ఆకాంక్షకు ట్రోఫీ బహూకరించారు. ముగింపు వేడుకకు అతిథిగా విచ్చేసిన స్టార్ షెట్లర్ సాత్విక్ సాయిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చాముండేశ్వర్‌నాథ్ మాట్లాడుతూ జూలై-ఆగస్టులో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌లో సాత్విక్ పతకం సాధిస్తే బీఎండబ్ల్యూ కారును కానుకగా ఇస్తానని ప్రకటించారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదిస్తామని

రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటించాలి

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి ఆమోదిస్తామని అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటించాలని బీసీ, కుల, ఉద్యోగ సంఘాల రాష్ట్ర సదస్సు డిమాండ్ చేసింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సదస్సు జరిగింది.

సదస్సుల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో పెట్టి అమలు చేసే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని, లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ అజీజ్‌పాషా మాట్లాడుతూ.. బీసీల హక్కులను కాలరాస్తున్న పార్టీలకు బీసీలందరూ ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని సూచించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రంగాల్లో తగిన వాటా ఇవ్వాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఆర్. కృష్ణయ్య చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. అనంతరం మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్, బీసీ ఉద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, బీసీ ఉద్యమకారుడు జనార్దన్, వివిధ కుల, ఉద్యోగ, బీసీ సంఘాల నాయకులు గుజ్జ సత్యం, కోల శ్రీనివాస్, పుట్టి యాదగిరి ముదిరాజ్, వెంకన్నగౌడ్, దానకర్ణ చారి, వేముల రామకృష్ణ, నంద గోపాల్ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

పద్మారావుగౌడ్ గెలుపునకు

బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన డివిజన్ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. కిషన్‌రెడ్డి ఐదేళ్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో నాయకులు గండికోట జనార్దన్, ఆర్కే బాబు, బి. లింగంగౌడ్, రెడపాక రాము, భూపతి లక్ష్మణ్, ఎ.సురేష్‌గౌడ్, ఎన్.లింగంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి కార్పొరేటర్ గైర్హాజరు

బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య, ఆమె భర్త దూసరి శ్రీనివాస్‌గౌడ్ హాజరు కాకపోవడంతో పార్టీలో విభేదాలు మరోసారి బహిర్గతయ్యాయి. డివిజన్‌లో పలుమార్లు పార్టీ సమావేశాలు జరిగినా కార్పొరేటర్ హాజరు కావడం లేదు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ మధ్య సమన్వయం లేదని పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విప్లవం



మాట్లాడుతున్న ప్రొఫెసర్. డి. కరుణాకర్

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెద్ద విప్లవం రానున్నదని, రోబోలకు సహజ చర్మాన్ని ఏర్పరుస్తున్న ప్రక్రియ నేడు సైన్స్ రంగంలో జరుగుతున్న పురోగతికి తార్కాణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ ప్రయోగాలలో జపాన్ దేశం ముందంజలో ఉందన్నారు. శుక్రవారం విద్యానగర్‌లో వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక - గణిత శాస్త్రాలలో ఇటీవలి పురోగతులు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ డి. కరుణాకర్ పాల్గొన్నారు. ప్రత్యేక వక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి. బాబు భౌతికశాస్త్రం రంగంలో జరుగుతున్న పరిణామాలపై పత్రాలను సమర్పించారు. సదస్సులో వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొని ప్రసంగించారు. పలు విశ్వవిద్యాలయాల రీసెర్చ్ విద్యార్థులు పత్రాలను సమర్పించారు.

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. సుకన్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా అబ్రహాం, సదస్సు కన్వీనర్లు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్. మల్లీశ్వరి, సహ కన్వీనర్లు బి. విజయనిర్మల, ఎల్. విష్ణుప్రియ, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై మే 15 నుంచి ఆందోళనలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై మే 15 నుంచి జూన్ మొదటి వారం వరకు అఖిల భారత రైతు సంఘం ఆందోళనలు చేయనున్నట్లు రైతు సంఘం నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తెలిపారు. శుక్రవారం విద్యానగర్ కార్యాలయంలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. చంద్రశేఖర్ అధ్యక్షతన రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల అంశంపై సదస్సు జరిగింది.

సదస్సులో పాల్గొన్న నర్సయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చి దశలవారీగా వడ్డీలను మాత్రమే మాఫీ చేసి రైతులను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 2 లక్షల రుణ మాఫీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోడు సాగు చేస్తున్న రైతులందరికీ 10 ఎకరాల పట్టాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు కె. రంగయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదిగ సంఘాల మహా కూటమి కన్వీనర్ పోకల కిరణ్

మాదిగలకు ఎంపీ టికెట్లు కేటాయించాలని కోరుతూ

నేటినుంచి నిరాహారదీక్ష

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్లు కేటాయించాలని మాదిగ సంఘాల మహా కూటమి కన్వీనర్ పోకల కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో సామాజిక భవనంలో మాదిగ సంఘాల మహాకూటమి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మాదిగ సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం ఉండి తీరాల్సిందేనన్నారు. ఈ లక్ష్య సాధన కోసం మాదిగలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20 నుంచి మాదిగ సంఘాల మహాకూటమి ప్రతినిధులు నిరాహార ధర్మ దీక్షలు చేపట్టనున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో మహాకూటమి నేతలు సంగీతం రాజలింగం, మాస్టార్జీ, వశపాక నరసింహం, ఆరేపల్లి రాజేందర్, గ్యార శ్రీను, జంగ్లీ నాగరాజు, పింజర్ల సుధాకర్ పాల్గొన్నారు.

'ఇంద్రజాల కళను ప్రోత్సహించాలి'

రాంనగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంద్రజాల కళ ప్రజల్లో ప్రత్యేకతను సంతరించుకుందని వందే భారత్ సినీ నిర్మాత, దర్శకుడు మల్లం రమేష్ అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో యువ తెలంగాణ మెజీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరంగం ప్రవీణ్, గుమ్మడవెల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా రమేష్‌తోపాటు చొక్కాపు వెంకటరమణ, సినీ నటుడు ప్రదీప్ రంగ్రేజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువ తెలంగాణ మెజీషియన్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఇంద్రజాల కళను ప్రోత్సహించాలని కోరారు.

ఆంజనేయస్వామి ఆలయంలో సుదర్శన హోమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం పునన్నిర్మాణ ద్వితీయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుదర్శన హోమం నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహావాచనము, పంచగవ్య ప్రాశన, దేవతాహ్వానం, మంటపారాధన, అగ్నిప్రతిష్ఠ, ప్రదోషకాల పూజ ఈవో దేవనాధం పర్యవేక్షణలో జరిగాయి.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కవాడిగూడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వంటగదుల్లో గ్యాస్ సిలిండర్‌లు లీకై జరిగే ప్రమాదాలపట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ అగ్నిమాపక స్టేషన్ ఎస్‌హెచ్‌వో జి. వెంకటేశ్వర్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ.. రాత్రి పూట సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాటలు బూటకం : సీపీఎం

గోల్నాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ. 10 లక్షల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్న మాటలు బూటకమని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. మహేందర్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నేత ఎం. దశరథ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణం జాప్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో వెయ్యిమంది దుకాణాలు, వ్యాపారాలు దెబ్బతిన్నాయని, వారు అప్పుల పాలయ్యారని అన్నారు.


డీబీపీ హైదరాబాద్ అభ్యర్థి షేక్ బాషా

కవాడిగూడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గం టికెట్‌ను షేక్ బాషాకు కేటాయించి బీ-ఫామ్ అందజేసినట్లు దళిత బహుజనపార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు మోదీకి రాజకీయ ఏజెంట్లుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే బహుజనులకు భవిష్యత్ ఉండదన్నారు. ఎన్నికల్లో దళిత బహుజనపార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. క్యాక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలి

గోల్నాక, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జైస్వాల్‌గార్డెన్ కాలనీలో లోప్రెషర్ నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ కోరారు. సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా జలమండలి గోల్నాక సెక్షన్ ఏఈ రోహిత్‌కుమార్ శుక్రవారం కాలనీలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


కిషన్‌రెడ్డి నామినేషన్‌కు ర్యాలీగా బీజేపీ శ్రేణులు




గాంధీనగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, బీజేపీ నాయకులు

బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి నామినేషన్‌కు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు ర్యాలీగా తరలి వెళ్లారు. కిషన్‌రెడ్డి రెండులక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు.


\- ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



కాచిగూడ నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు



బాగ్‌లింగంపల్లి నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ రవిచారి తదితరులు



నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ వై. అమృత, బీజేపీ శ్రేణులు



కిషన్‌రెడ్డి ర్యాలీలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్

చోరీ కేసులో నిందితుడికి నాలుగు నెలల జైలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి న్యాయస్థానం నాలుగు నెలల కఠిన కారాగార శిక్ష విధించింది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోఠిలో నివసిస్తున్న సుగుణ్‌సన్ కుమారుడు విల్సన్(40) గత ఏడాది కాచిగూడ పీఎస్ పరిధిలో దొంగతనం చేశాడు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును శుక్రవారం విచారించిన నాంపల్లి ఏసీ ఎంఎం కోర్టు న్యాయాధికారి నిందితుడికి నాలుగు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

బర్కత్‌పుర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలో ఓ అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్‌లో వెళ్తుండగా కారు డ్రైవర్ అబ్బయ్య(29) బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక విషయం తల్లికి చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

అంబర్‌పేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అంబర్‌పేట ఖాద్రీబాగ్‌లో నివసిస్తున్న సయ్యద్ ముస్తఫా అలీ(40) సరూర్‌నగర్ బిగ్‌బాస్కెట్ కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల క్రితం భార్యకు విడాకులు ఇచ్చాడు. ఏడాది క్రితం అతడి తల్లి చనిపోవడంతో మానసిక వేదనకు గురయ్యాడు. ఈనెల 13వ తేదీన ఉద్యోగానికి వెళ్లిన ముస్తఫా అలీ తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న

మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

అంబర్‌పేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అంబర్‌పేట పోలీసులు పట్టుకున్నారు. అంబర్‌పేటకు చెందిన రెహ్మాన్ శుక్రవారం ఉదయం 7 గంటలకు పటేల్‌నగర్ వైపు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి అతడిని పట్టుకున్నారు. మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి రెహ్మాన్‌పై కేసు నమోదు చేశారు.



ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు. శుక్రవారం స్టేషన్ పరిధిలో గోల్కొండ చౌరస్తా నుంచి నాగమయ్యకుంట, ఆజామాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, అచ్చయ్యనగర్, మూన్‌కేఫ్, సూర్యానగర్, చిక్కడపల్లి మెయిన్‌రోడ్, బాపూనగర్, వివేక్‌నగర్, హనుమాన్ టెంపుల్ లేన్ ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

'బీజేపీ, కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు'

నల్లకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీవన్‌గౌడ్ ప్రజలను కోరారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో అయ్యప్ప స్వామి ఆలయం వీధి, బతుకమ్మకుంట తదితర ప్రాంతాలలో పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన పనులను చూసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

ఓటింగ్ శాతం పెంపునకు మహిళామోర్చా కృషి చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపునకు మహిళా మోర్చా కృషి చేయాలని బీజేపీ శాసనసభా పక్ష ఉపనేత వెంకటరమణారెడ్డి కోరారు. మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె. గీతామూర్తి శుక్రవారం ఆయనను కలిసి లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్‌పై చర్చించారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు.

ప్రభాకర్‌రావు సేవలు మరువలేనివి : కావ్యా కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తండ్రి ప్రభాకర్‌రావు పేదలకు చేసిన సేవలు మరువలేనివని కావ్యకిషన్‌రెడ్డి అన్నారు. ప్రభాకర్‌రావు రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన సంతాప సభ బర్కత్‌పురలో శుక్రవారం నిర్వహించారు. కావ్యాకిషన్‌రెడ్డి ప్రభాకర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యశ్వంత్, జ్యోతి, ముఖేష్ పాల్గొన్నారు.

గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్స్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పి. మోదీరాందేవ్ డిమాండ్ చేశారు. యాదాద్రి జిల్లాలో మూడేళ్లలో తొమ్మిది మంది విద్యార్థులు చనిపోయారని, దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారం ఎస్సీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భువనగిరి ఎస్సీ హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని ప్రశాంత్ అనే విద్యార్థి మృతి చెందాడని ఆరోపించారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఎస్ఎస్ఏ అధ్యక్షుడు కె. మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

